# మృగతృష్ణ ★

రచన:
శ్రీ రాధేయ.

(గతసంచిక తరువాయి)

మరి ఎందుకన్నయ్యా నాదగ్గర విషయాలు దాస్తారు? అమ్మ ఏదో మౌనంగా బాధపడటం తప్ప నాతో పల్లెత్తుమాట కూడా అనదు నీవు గూడా అంతేనా?

అయితే అంతా విన్నావన్నమాట!

ఏం మీ బాధలు పంచుకోడానికి నాకు బాధ్యత లేదా అన్నయ్యా?

లేదమ్మా శాంతి! నిన్నొక ఇంటిదాన్ని చేసి నువ్వు సంతోషంగా వుంటే చూస్తుండాలన్న ఆకాంక్షవుంది. నీ వుండే ఈ కొద్ది కాలము మా కష్టాలు కన్నీళ్ళయి నిన్ను మరింత బాధ పెట్టడానికి మాకు మనసొప్ప లేదమ్మా!

పో నాకు పెళ్ళా... ఇప్పుడే ఎందు కన్నయా? ఇప్పుడు మనమున్న పరిస్థితుల్లో ఎందుకన్నయ్యా? అలా అనకు శాంతి: నిజంగా నువ్వు లక్ష్మీదేవిలా వున్నావు. నిన్ను పొందినవాడు ఎంతో అదృష్టవంతుడమ్మా! ఏమైనా సరే...నీకు నచ్చినోణ్ణి, నువ్వు మెచ్చినోణ్ణి వెతుకుతాను. అదే నా ధ్యేయం అన్నాడు దృఢ నిశ్చయంతో.

నా పెళ్ళి వద్దు అన్నయ్యా:

“శాంతి” అంటూ అదిరి పడ్డాడు సారధి.

లేదన్నయ్యా: ఇలా వుంటేనే పూర్తిగా సంతోషంగా వుంది. నువ్వు పెళ్ళి చేసుకోవాలి, నాకు వదిన రావాలి...అంది నవ్వుతూ.

ఎవరైనా వింటే నవ్వుతారు. నాకు పెళ్ళేమిటి ఇప్పుడసలు. నీ పెళ్ళి తరువాతే ఆలోచిస్తాను, ఆ విషయం అన్నాడు చెల్లెలి ముఖంలోకి ఆర్తంగా చూస్తూ.

అయితే ఇప్పుడు మనమున్న పరిస్థితుల్లో నాకు చేసుకోవాలని లేదన్నయ్యా.

లేదమ్మా! పరిస్థితులన్నీ చక్కబడుతాయి. నాకూ ఉద్యోగం వస్తుంది. చక్కని బావ వస్తాడు అన్నాడు. బాధల్ని మరచి సంతోషాన్ని ముఖములలో పులుముకుంటూ.

అన్నయ్యా, నువ్వు “దేవునివి” అంటూ కౌగిలించుకుంది కన్నీరును ఆపుకుంటూ. ఛ-ఛ-ఏడ్వరాదమ్మా! నీ కంటినీరు నేను చూడలేను అన్నాడు బుగ్గలపై జారిన కన్నీటిని తుడుస్తూ.

ఇవి కన్నీరు కాదన్నయ్యా, ఆనంద బాష్పాలు-అంది సంతోషం పొందిన హృదయంతో. సరే వెళ్ళి పడుకోమ్మా చాలా పొద్దుపోయింది, అన్నాడు సారధి. ఇంకా ఏమిటో మాట్లాడుకుంటున్నారు అని కేక వేసింది జానకమ్మ. ఇదిగో పడుకుంటాం అంటూ ప్రక్కలపై వాలిపోయారు అన్నాచెల్లెలు ఇద్దరూ. పగలంతా పని చేసి అలసివుండడంచేత నిద్రాదేవి వెంటనే వారిని ఒడిలోనికి తీసుకుని బంధించింది, బాధలనుండి తాత్కాలికంగా విముక్తి ప్రసాదించటానికి.

● ● ●

సారధి రోజూ పేపరు చూస్తున్నాడు, ఉద్యోగాన్వేషణలో అది మొదటిమెట్టు, ప్రతిరోజూ రెండు అప్లికేషన్లు పంపుతున్నాడు. వాటికి డబ్బు ఖర్చు అవుతున్నది కానీ ఫలితమేమో కన్పించలేదు. కొన్ని ఇంటర్వ్యూలకికూడా వెళ్ళివొచ్చాడు. ఫలితం శూన్యం. పేరుకు మాత్రం ఇంటర్వ్యూ జరుపుతారు అక్కడ అడిగేవన్నీ అవక తవక ప్రశ్నలు అన్నిటికీ జవాబిచ్చిన సారధికి డబ్బు, రికమండేషన్లు లేదు. అందువలన సారధికి ప్రయత్నం మాత్రమే మిగిలిపోయింది. ఏమీ చేయలేక నడి సముద్రంలో నావలావుంది తన పరిస్థితి.

అప్లికేషన్లుకూ, ఇంటర్వ్యూలకూ చేతిలో వున్న కాస్త డబ్బు అయిపోయింది, కాని జానకమ్మలో తనకొడుకు ఆఫీసరు అవుతాడన్న ఆశమాత్రం నశించలేదు. తల్లి తృప్తికోసం విధిగా అప్లై చేస్తున్నాడే తప్ప తనకు నమ్మకం లేదు. తన ఆర్థిక ఇబ్బందులు రోజు రోజుకీ తీవ్ర మవుతున్నాయే కాని పరిష్కార మార్గం కనుపించ

లేదు. యిటు మారిపోతున్న జానకమ్మ ఆరోగ్యంలో కూడా మార్పు వచ్చింది.

* * *

పోస్ట్ అన్న కేకవిని నిత్యమూ వస్తున్న ఇంటర్వ్యూలేగా అనుకుంటూ వెళ్ళి అందుకున్నాడు. మద్రాసులో ఒక అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో క్లర్కు వుద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. దప్పిక తీరుతుందని ఎండమావుల వైపు పరుగెత్తితే మరింత ఆయాసం కలుగుతుందే గాని దప్పిక తీరే మార్గం కన్పించదు కదా! అలాగే సారతి స్థితి ఇప్పుడు.

ఏమిటన్నయ్యా అలావున్నావు? ఆశే ఏమిటో వచ్చినట్లుందే! అంది సారతి చేతిలోని కవరు చూచి. ఏమీ లేదమ్మా ఇది మనకు మామూలే కదా! మద్రాసుకు ఇంటర్వ్యూకు రమ్మని వచ్చింది. ఇదే ఫైనల్ సెలెక్షన్ అని వ్రాసారు అని అన్నాడు నిర్లిప్తంగా. అలాగా అయితే తప్పక వెళ్ళన్నయ్యా! ఈ సారి నీకు తప్పక వస్తుంది. కాంతిలో వెలిగిపోయింది శాంతి ముఖం.

పిచ్చి శాంతి! అంత తేలిగ్గా దొరకుతాయటమ్మ ఉద్యోగాలు! ఎందరో నిరుద్యోగులున్నారు ఈ దేశంలో. అందులో నేనొకణ్ణి. కొందరు డబ్బుతో కొంటారమ్మ, కాని మనలాంటి దరిద్రులు ఇంటర్వ్యూలకు వెళ్ళడమే నమ్మా ఈ ఖర్చులు కూడా భరించలేని వాళ్ళు వెళ్ళకుండా మానేస్తారు.

తప్పదు అలా దిగులు పడకన్నయ్యా, నీ మీదే ఆశలుంచుకుని బ్రతుకుతున్న మా మాట కాదనుకు, అమ్మ చూడు ఎలా అయిపోయిందో, రోజురోజుకు ఆమె జబ్బు తీవ్రంగా వుంది. మీ ఇద్దరూ ఇలా బాధ పడుతుంటె నేను సహించలేనన్నయ్యా!

శాంతీ! నావంటి దౌర్భాగ్యుడు అమ్మ కడుపున పుట్టడం, నీకు అన్నయ్య కావడం తప్పమ్మా! నాకు ఉద్యోగం దొరకుతుందన్న ఆశ ఎండమావుల్లోని నీరు వంటిదేనమ్మ.

తప్పదన్నయ్యా; ఈ ఇంటర్వ్యూకు నీవు వెళ్ళాలి, వెళ్ళితీరాలి, నీమీదే ఆశలుంచుకుని కళ్ళలో ప్రాణాలుంచుకుని బ్రతుకుతున్న అమ్మకోసమైన నీవు వెళ్ళాలి. అమ్మనిలా విడిచి ఈ పరిస్థితుల్లో వెళ్ళలేనమ్మా, అమ్మను

C.K.C

ELEPHANT BRAND




Carnataka Knitting Co.

TIRUPUR-638 602.

★

**Sales depot:**

No. 4-6-213, PAN BAZAAR,

SECUNDERABAD-500 003.

డాక్టరుకు చూపించాలి, ఆమె ఆరోగ్యాన్ని కాపాడు కోవాలి.

అందాకా నేను చూసుకుంటాను, నువ్వు వెళ్ళన్నయ్యా అంది, అన్నయ్య వైపు దీనంగా చూస్తూ. వెళ్ళను, ఫలితం లేదమ్మా! వెళ్ళితే సాధిస్తానన్న నమ్మకంతో నే ఇన్నాళ్ళూ తిరిగాను, ఇంకా లాభంలేదు.

నువ్వు వెళ్ళక పోతే నామీద ఒట్టు, అని అందించినది ఒక బాణం ప్రయోగిస్తూ. "శాంతీ" అంటూ హడలి పోయాడు సారథి. నీకు తెలీదమ్మా ఇప్పుడు మన దగ్గిర పైసాకూడా లేదు.

అవును అదేకదూ, నీ పరితాపం? అయితే ఒక మాట అడగనా? అంది శాంతి అడగమ్మా అని అన్నాడు సారథి. నీవు ఒప్పుకుంటానంటే చెప్తాను అని అంది శాంతి, సరే అన్నాడు సారథి.

శాంతకేపు దీర్ఘంగా ఆలోచించి చేసేది లేక నా మెడలోవున్న ఈ చైనును అమ్ము, డబ్బు పట్టుకెళ్ళు అన్నయ్యా అంది విచారంగా.

శాంతీ! నీకేమైనా మతిపోయిందా? ఇప్పటికే ఇల్లంతా దోచి అప్పులతో నింపినాను, నీ మెడలో వున్న ఒక్క చైనును అమ్మి నిన్ను బోసిమెడలో చూడలేనమ్మా. పెళ్ళీడుకొచ్చిన నీకు ఒక హారమైనా చేయించక పోయానే అని నేను బాధ పడుతూవుంటే, ఇంకా నన్నెందుకమ్మా బాధపెడ్తావు? క్షమించు శాంతీ! నేనాపని చేయలేను.

అన్నయ్యా! నాకు ముందే మాట ఇచ్చావు. అవునులే నామాట ఎందుకు వింటావు, నీకు చెప్పడానికి నేనెవరిని, ఎప్పటికైనా మరొకరింటికి వెళ్ళిపోయేదాన్నిగా, అందుకే నామాట వినాలని ఎక్కడుంది? కాని అన్నయ్యా నీకు ఉద్యోగమొస్తె ఇలాంటివి ఏన్నైనా చేయించుకోవచ్చు, నువ్వు ఇంటర్వ్యూలకే పోకుండా కూర్చుంటె మన బ్రతుకు ఎలా గడుస్తాయన్నయ్యా? వుండు అమ్మకు చెప్పివస్తాను అంటూ కన్నీటితో విస విసా వెళ్ళిపోయింది శాంతి

హే! భగవాన్ ... ఏందుకయ్యా, నాకు ఇంత విషమ పరీక్షను పెట్టావు అంటూ బాధగా కణతలు నొక్కుకున్నాడు.

బాబూ! నామాట వినరా! నువ్వు వెళ్ళిరా బాబు! ఈ ఉద్యోగమైనా తప్పక వస్తుంది. నువ్వు కష్టపడి పని చేయలేవు. సెంటు భూమికూడా లేవు మనకు ఎలా బ్రదగ్గలం? అంటూ ఆయాసంతో మాట్లాడ లేకపోతున్న జానకమ్మను చూసి క్రుంగిపోయాడు సారథి.

అమ్మా! అసలే నీ ఆరోగ్యం బావుండలేదు, నిన్నిలా ఒంటరిగా వదలి వెళ్ళలేనమ్మా! అని అన్నాడు సారథి.



బనియన్ల తయారీలలో
మాదొక ప్రత్యేకత
అందుకే...
"టిప్ టాప్ బనియన్లు"
నాణ్యమునకు ప్రసిద్ధి చెందియున్నది.
"టిప్ టాప్"
బనియన్లు కొని ధరించి ఆనందించండి.
—: తయారించువారు :—
TIP TOP HOSIERY MFRS.,
35-28, Dharapuram Road,
TIRUPUR-638 604.

పరవాలేదు బాబు! నాకేం శ్రమలేదు. నువ్వు ఉద్యోగస్తుడైతే మళ్ళా నాకు ఊపిరి వస్తుంది, నన్ను కాంతి చూచుకుంటుందిగా... నా మాటవిని వెళ్ళిరా బాబూ! ఇదిగో సారధి పైను తీసికెళ్ళు డబ్బు పట్టుకునిపో! ఈ సారి నీకు తప్పక ఉద్యోగం వస్తుంది బాబూ...తప్పక అంటుండగనే దగ్గుతెర అడ్డుపడి మాట్లాడలేక పోయింది.

అమ్మా ఎక్కువగా మాట్లాడకమ్మా అంటూ కాంతి, సారధి జానకమ్మను పొదిలి పట్టుకున్నారు.

ఏం బాబు! నా మాటవినవా అని అంది జానకమ్మ.

వింటానమ్మా, తప్పకుండా పోయివస్తానమ్మా, అంటూ కళ్ళు కన్నీటి చెలిమెలుకాగా భారంగా అడుగు వేస్తూ ఈసారి ఉద్యోగస్తుడై వస్తాను అన్నాడు.

క్షేమంగా వెళ్ళి సంతోషకరమైన వార్త తీసుకురా నాయనా, అని నీరసంతోనే దీవించింది తల్లి. మంచి మనసున్న నీకు దేవుడు మేలు చేస్తాడన్నయ్యా, అని కాంతి నవ్వుతూ అభినందించింది. అధైర్య పడకు, ఇలాంటివెన్నో నీ జీవితంలో ఎదుర్కోవాలి అంటూ హెచ్చరించింది అంతరాత్మ.

* * *

కంట్లో బొగ్గులు రవ్వని పడగానే ఆ బాధకు నీనరిలా తిరుగుతున్న గతం, పుటుక్కున తెగిపోయింది. ఆ భావంలో పడికన్ను బాగా ఎరుపెక్కింది. తనగత జీవిత గాథకు తోడు సంతతంగా కారే కన్నీటితో జ్యోతుల్లా వున్న కళ్ళల్లోనుండి రక్తం ధారగా ప్రవహిస్తుందా అని పిస్తోంది చూపరులకు. ప్రక్కవారు చూస్తారేమోనని తన కన్నీటిని ఆనకట్ట కట్టి ప్రయత్నిస్తున్నాడు కాని, విఫలుడైపోయాడు.

ఈ మనుషులతో, కాలంతో పనిలేనట్లు వేగంగా ముందుకు దూసుకు పోతున్నది కారు చీకట్లను చీల్చుకుని పార్థుడు వదలిన బాణంలా, వారివారి గమ్యస్థానాలకు చేర్చటానికి, భాద్యతవహిస్తూ ముందుకు సాగుతున్నది రైలు.

కాని నాకు గమ్యమేది? అంటు ఘోషించింది సారధి మనసు. కంపార్ట్మెంటులోని వారంతా ఎవరిమాటల్లో వారు నవ్వ గలుగుతున్నారు. మరికొందరు హాయిగా నిద్రపోతున్నారు. తనకెదురుగా కూర్చున్న కొత్త జంటలు మాటలాడుకుంటూ అనురాగామృతాన్ని కళ్ళలో జాఱుకుంటూ కోటి కోర్కెలు మనసులో నింపుకుంటూ సరిక్రొత్తలోకంలో విహరిస్తున్నారు.

మద్రాసు చేరటానికి ఇంకా రెండుగంటలు పడుతుందనుకున్నాడు. అప్పటికే రాత్రి పన్నెండు గంటలైంది. ప్రతీ స్టేషనులో ఆగుతూ వారివారికి వీడ్కోలిచ్చి పంపుతూ నేవుంది. కొందరు ఆకలికి ఆగలేక వెంటతెచ్చుకున్న తినుబండారాలను అర్ధరాత్రిఅయినా తింటున్నారు. సారధిలో ఆకలిమాట హెచ్చయ్యింది. తన వలన ఇద్దరువ్యక్తులు ఆవేదనతో కుమిలిపోతున్నారు. ఒకటి తనను పెంచి తండ్రిలేని లోటును తీర్చి ఇంతవరకూ చదివించింది, కడకు ఒక ఉద్యోగునిగానైనా చూడగలనో లేదోనన్న తల్లి. ఈ దేశంలో కట్నపిశాచం కదను త్రొక్కుతున్నంతవరకూ తన వివాహం కాదని తెలుసుకున్న చెల్లెలు కాంతి వీరిద్దరికీ ఆశాదీపాన్ని నేనే...కాని ఏమిటో నాపై విధి ఇంత కక్షబూనిందా? ఇలా ఆవేదనా జలధిలో ఎగిరి పడే ఆలోచనల కెరటాల ఘోషను వినలేక కళ్ళు మూసుకున్నాడు.

* * *

ఉదయం పదిగంటలకే ఇంటర్వ్యూ అని తెలిసిన సారధి తొమ్మిదిగంటలకే ఆఫీసుకు చేరుకున్నాడు. అప్పటికే వందకు పైగా వచ్చి చేరినతోటి నిరుద్యోగులను చూస్తె తనకు ఏ మూలలోవున్న ఆశా నీరుగారి పోయింది.

అందరూ మెరిట్ పై పాసై వచ్చినవారే! జరగబల



సింది ఎలాగూ జరుగుతుంది కదా అనుకున్నాడు చేసేది లేక. ఇంటర్వ్యూ మొదలైంది. ఒక్కొక్కరినే వరుసగా పిలుస్తున్నారు. లోపలనుంచి బయటకు వచ్చేవారేమో నిరాశగా ముఖం దించుకుని వస్తున్నారు కొందరు. మరి కొందరు తమవంటివారికి అందదుకదా అంటూ చప్పరిస్తూ వస్తున్నారు, కాని తనపైన జాలి చూపేదెవరు?

గాంధీజీ గారిపై మీ అభిప్రాయమేమిటి? మొట్ట మొదట గదిలోనికి అడుగు పెట్టగానే సారథిని ప్రశ్నించాడు మేనేజరు.

ఆయన మీద నాకెటువంటి ద్వేషమూ లేదుసార్! కాని ఆయన చేసిన కార్యాలు చూస్తె నాకు జాలి కలుగుతుంది. సత్యవాధి, జాతిపిత, అని ఇలాంటి సమాధానాల్ని విన్న మేనేజరుకు సారథి సమాధానం విని ఆశ్చర్యం ప్రకటించాడు.

ఆయన చేసిన పనులేమిటో వివరిస్తారా?

మధ్యపానం నిషేదమన్నారు, సత్యము, ధర్మమునడిచే మార్గాన్నే అనుసరించమన్నారు, జాతి, మత, కులాలు అంతరించిపోవాలని, మానవుల్లో సమభావం, సహజీవనం రావాలని ఆకాంక్షించారు. కానీ ఆయన తన ఆశయాలను అమలు జరిపేందుకు వ్యవధి లేక పోయింది. పాపం! నేటి ప్రజలు ఆయన వల్లించిన సూత్రాలను ఆచరించక పోగా పైగా వ్యతిరేకిస్తున్నారు. పాపం ఎంతో ప్రగతిని కాంక్షించిన ఆ మహా పురుషుడు తన ఆశయాను ఆచరణలోకి పెట్టక ముందే ఆహుతి అయిపోయాడు. సారథి సమాధానం విన్న మేనేజర్ అప్రతిభుడైపోయాడు.

కుటుంబ నియంత్రణపై మీ అభిప్రాయం?

సదభిప్రాయమే సార్! ముక్తసరిగా సమాధానిమిచ్చాడు.

ఈ ఉద్యోగం మీ కెందుకు అవసరమొచ్చింది?

ఈ జానెడు పొట్టను పోషించుకో కలిగే ఏ ఉద్యోగమైనా నాకు ఒక్కటే సార్!

యెస్, యు కెన్ గో! అన్నారు మేనేజరు.

థాంక్యూసార్ అంటూ బయట పడ్డాడు.

పన్నెండు గంటలకే ఇంటర్వ్యూ ముగిసిపోయింది. అందరూ ఇళ్ళకు బయులుదేరి వెళ్ళిపోతున్నారు.

ఒరే ఈ విషయం నీకు తెలుసా? ఎవరో ముగ్గురు మిత్రులు మాట్లాడుకుంటున్నారు. ఏమిటిరా అని రెండోవాడన్నాడు. ఇన్ని తిప్పలూపడి ఈ వెధవ ఉద్యోగానికి ఎంతదూరం వచ్చామో తెలుసా? కాని ఏం లాభం! అన్నాడు చప్పరిస్తూ! లాభమేమిటిరా నా బొంద సరిగా చెప్పి ఏడ్వు అంటూ మరొక్క మిత్రుడన్నాడు. చెప్తా వినరా బాబోయ్. మేనేజరు బావమరది కొట్టేశాడట ఆ ఛాన్స్. అలాగా అంటూ కళ్ళు తేలివేశారు మిగతా ఇద్దరూ.

వాః! వెనుక నడుస్తున్న సారధి చెవిలో ఈ మాట పడినా, ముల్లుల్లా గ్రుచ్చుకుని బాధ పెట్టలేదు అతని గుండెను. అందుకే నిర్లిప్తంగా నవ్వుకున్నాడు లేకుంటే మాత్రం ఆ ఉద్యోగం ఈ నిర్భాగ్యునికి వస్తుందా అనుకున్నాడు.

(సశేషం)

Regd. Trade Mark

DOVETEX
TRADE MARK

No. 162919 & 258010

ఫోన్: 22217 తంతి: "డొటెక్స్"

# డొటెక్స్ కంపెనీ

(ఉత్పత్తిదారులు, రవాణాదార్లు)

బెడ్ షీట్స్ టవల్స్, దోవతులు, టర్కీ-జకార్డ్ టవల్సు మొదలైనవి, చేనేతబట్టలు మరియు నూలు వ్యాపారస్తులు.

నెం. 14, మహల్ 2-వ, వీధి. మధురై - 625 001.